News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :68 | ఖమ్మం | గురువారం, ఏప్రిల్ 23, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad



## తెలంగాణలో ఆర్టీసీ సమ్మె.. డిపోలకే పరిమితమైన బస్సులు, ప్రయాణికులకు తిప్పలు

- తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె
- ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో సమ్మె నిర్ణయం
- ఎన్నికల హామీలు అమలు చేయాలని కార్మికుల డిమాండ్
- ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

తెలంగాణ వ్యాప్తంగా టీజీఎస్ ఆర్టీసీ బస్సులు అర్ధరాత్రి నుంచి నిలిచిపోయాయి. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ సమ్మెకు పిలుపునిచ్చింది. ప్రభుత్వంతో మంగళవారం జరిపిన చర్చలు విఫలం కావడంతో ముందుగా ప్రకటించినట్లుగానే కార్మికులు సమ్మె బాట పట్టారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని డిపోలలో బస్సులు బయటకు రాకుండా నిలిచిపోయాయి. ఫలితంగా ఇవాళ ఉదయం నుంచే కార్యాలయాలకు, పాఠశాలలకు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులతో పాటు ఇతర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమకు ఇచ్చిన 32 హామీలను తక్షణమే అమలు చేయాలని కార్మికులు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. హామీలు నెరవేర్చే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని డిపోల వద్ద కార్మికులు బైఠాయించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలనే డిమాండ్‌ను కూడా బలంగా వినిపిస్తున్నారు.ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, ఖమ్మం, సంగారెడ్డి, మెదక్ సహా అన్ని జిల్లాల్లోనూ సమ్మె ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఆదిలాబాద్ రీజియన్‌లో 641 బస్సులు ఆగిపోగా, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పది డిపోలకు చెందిన 850 బస్సులు నిలిచిపోయాయి. వేలాది మంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొంటున్నారు. బస్టాండ్‌ల వద్ద ప్రయాణికులు గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. పరిస్థితిని గమనించిన అధికారులు, ప్రయాణికుల ఇబ్బందులను తగ్గించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. కొన్నిచోట్ల అద్దె బస్సులను నడిపేందుకు కసరత్తు చేస్తున్నారు. అయితే, అవి ప్రయాణికుల రద్దీకి సరిపోకపోవడంతో చాలామంది ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది.ం

## సమ్మె పరిష్కారం కాదు.. విధుల్లో చేరండి: ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి

- ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారానికి ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేశామని వెల్లడి
- నాలుగు వారాల్లో కమిటీ నివేదిక సమర్పిస్తుందని మంత్రి పొన్నం హామీ
- 32 డిమాండ్లలో 29 సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టీకరణ
- సమ్మె వల్ల సామాన్య ప్రజలు, మహిళలు తీవ్రంగా ఇబ్బంది పడతారని ఆవేదన



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఉద్యోగులు తలపెట్టిన సమ్మెను విరమించుకోవాలని, ప్రజా సంస్థను కాపాడుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. సమ్మె ఏ సమస్యకూ పరిష్కారం కాదని, ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ పరిశీలన చేస్తోందని, నాలుగు వారాల్లో నివేదిక వస్తుందని ఆయన స్పష్టం చేశారు.(ఈ మేరకు మంత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. సంస్థను, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు సమ్మెను విరమించుకోవాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నలుగురు సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేశామని, ఇది కాలయాపన చేసే వ్యూహం కాదని స్పష్టం చేశారు. ఉద్యోగులు లేవనెత్తిన 32 డిమాండ్లలో 29 అంశాలపై ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదని, వాటిని వెంటనే పరిష్కరించవచ్చని తెలిపారు. మిగిలిన ఆర్టీసీ విలీనం, యూనియన్ల గుర్తింపు వంటి అంశాలు సాంకేతిక పరమైనవని, వీటిపై లోతైన పరిశీలన అవసరమని, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వివరించారు.ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను పొన్నం ప్రభాకర్ గుర్తుచేశారు. ఆర్టీసీ విలీనం ఆలస్యమైనప్పటికీ, ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని అన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 2017 పీఆర్సీతో పాటు బకాయిపడ్డ డీఏలను, 2013 నాటి బాండ్లను సైతం పరిష్కరించినట్లు తెలిపారు. రూ.1,205 కోట్లుగా ఉన్న పీఎఫ్ బకాయిలను రూ.600 కోట్లకు, రూ.690 కోట్లుగా ఉన్న సీసీఎస్ బకాయిలను రూ.300 కోట్లకు తగ్గించామన్నారు. పీఎఫ్, సీసీఎస్ కోసం ప్రతినెలా రూ.75 కోట్లు చెల్లిస్తున్నట్లు చెప్పారు.పని భారం తగ్గించేందుకు త్వరలోనే 4,538 మంది ఉద్యోగుల నియామకాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే 1,134 కారుణ్య నియామకాలు చేపట్టామని, గతంలో తొలగించిన 250 మంది ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకున్నామని పేర్కొన్నారు. ఆర్టీసీ ప్రస్తుతం కోలుకుంటోందని, ఈ దశలో సమ్మె చేయడం సంస్థకు, ప్రజలకు నష్టం కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ 65 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీపై ఆధారపడి ఉన్నారని, వీరిలో 45 లక్షల మంది మహిళలేనని గుర్తుచేశారు. పేద ప్రజలు ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను భరించలేరని, కాబట్టి ప్రజా రవాణాకు ఆటంకం కలిగించకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసనను తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని, వారికి అండగా ఉంటుందని భరోసా ఇస్తూ, ప్రజలకు అసౌకర్యం కలగకుండా వెంటనే విధుల్లో చేరాలని కోరారు.

## కాళేశ్వరం కేసు.. కేసీఆర్, హరీశ్ రావులకు హైకోర్టులో భారీ ఊరట



కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ నివేదిక ఆధారంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి టి. హరీశ్ రావుతో పాటు మరో ఇద్దరిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. విచారణ కమిషన్ చట్టం కింద నిర్దేశించిన సరైన ప్రక్రియను ఘోష్ కమిషన్ పాటించలేదని కోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది.

కాళేశ్వరం ప్రాజెక్టుపై ఘోష్ కమిషన్ నివేదికను రద్దు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, హరీశ్ రావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, మాజీ సీఎస్ ఎస్.కె. జోషి, ప్రస్తుత ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్ వేర్వేరుగా రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. విచారణ కమిషన్ చట్టంలోని సెక్షన్ 8బీ, 8సీ కింద తమకు తప్పనిసరిగా నోటీసులు జారీ చేయలేదని, తమ వాదనలు వినకుండానే కమిషన్ నివేదిక రూపొందించిందని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేస్తూనే, ప్రస్తుత నివేదిక ఆధారంగా పిటిషనర్లపై చర్యలు తీసుకోవడానికి వీల్లేదని స్పష్టం చేసింది.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2016లో ప్రారంభమైన కాళేశ్వరం ప్రాజెక్టు, ప్రపంచంలోనే అతిపెద్ద బహుళ దశల ఎత్తిపోతల పథకంగా గుర్తింపు పొందింది. ఈ ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై విచారణకు కాంగ్రెస్ ప్రభుత్వం 2024 మార్చిలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ తన నివేదికను 2025 జులై 31న ప్రభుత్వానికి సమర్పించింది. ప్రాజెక్టులో జరిగిన అవకతవకలకు కేసీఆర్, హరీశ్ రావు సహా అధికారులను బాధ్యులను చేస్తూ నివేదికలో పేర్కొంది.పిటిషనర్ల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ కౌన్సిల్ దామా శేషాద్రి నాయుడు వాదనలు వినిపించగా, ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి, కమిషన్ తరఫున సీనియర్ కౌన్సిల్ ఎస్. నిరంజన్ రెడ్డి వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా నలుగురు పిటిషనర్లపై ఎలాంటి బలవంతపు చర్యలు ప్రారంభించవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## గవర్నర్ నిర్ణయం తర్వాతే ఎమ్మెల్సీలపై నిర్ణయం.. జూలై 22 కు విచారణ వాయిదా వేసిన సుప్రీంకోర్టు



సుప్రీంకోర్టులో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకం కేసు విచారణ మరోసారి వాయిదా పడింది. బుధవారం (ఏప్రిల్ 22) న గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకం కేసును జస్టిస్ విక్రమ్ నాథ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం..విచారణను జూలై 22కు మరోసారి వాయిదా వేసింది.

ఈ కేసులో ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన అటార్నీ జనరల్.. ఎమ్మెల్సీల నియామకంలో కొత్త గవర్నర్ నిర్ణయం తీసుకునేందుకు కొంత సమయం ఇవ్వాలని సుప్రీంకోర్టు ధర్మాసనాన్ని కోరారు. కొత్త గవర్నర్ నిర్ణయం తర్వాత విచారణ కొనసాగించాలా? ముగించాలో సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీంతో తీర్పును జూలై 22 కు వాయిదా వేసింది సుప్రీంకోర్టు ధర్మాసనం.

### ఎమ్మెల్సీల నియామక వివాదం ఇదీ..

గత బీఆర్ఎస్ సర్కార్ మంత్రివర్గం గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించి గవర్నర్‌కు సిఫారసు చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వ్యక్తులకు రాజకీయ నేపథ్యం ఉన్నదంటూ అప్పటి గవర్నర్ తమిళిసై ఈ సిఫారసును తిరస్కరిస్తూ.. 2023, సెప్టెంబర్ 19న ఉత్తర్వులు రిలీజ్ చేశారు. ఆ ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాసోజు, కుర్రా వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. ఇదే టైంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారడం... సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గం 2024 జనవరి 13న కోదండరాం, ఆమీర్ అలీఖాన్ పేర్లను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమిస్తూ సిఫారసు చేసింది. ఈ సిఫారసును గవర్నర్ ఆమోదించడంతో అదే ఏడాది జనవరి 27న ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ రిలీజ్ చేసింది.

ఇదిలా ఉండగానే.. దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఇరువైపుల సుదీర్ఘ వాదనలు విన్న హైకోర్టు ధర్మాసనం.. గతేడాది 2025 మార్చి 17న 73 దాసోజు శ్రవణ్ కుమార్, కుర్రా సత్యనారాయణ నామినేషన్లను తిరసరిస్తూ గవర్నర్ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్టు వెల్లడించింది. అలాగే.. కొత్తగా ఎమ్మెల్సీగా కోదండరాం, అలీఖాన్?ను నియమించాలనే తీర్మానంతోపాటు వాళ్లను ఎమ్మెల్సీలుగా నియమిస్తూ ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌ను కూడా రద్దు చేస్తున్నట్టు స్పష్టం చేసింది. ఆ తర్వాత ఎమ్మెల్సీ అభ్యర్థులుగా కోదండరాం, అలీఖాన్ల పేర్లను రాష్ట్ర మంత్రివర్గం మరోసారి సిఫారసు చేసింది. ఆ పేర్లను గవర్నర్ ఆమోదించడంతో కోదండరాం, అలీఖాన్ ఎమ్మెల్సీలుగా నియమితులయ్యారు. గవర్నర్ తీసుకున్న నిర్ణయం చట్ట వ్యతిరేకమని, రాజ్యాంగ విరుద్ధమని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని నీరుగార్చేలా ఉందంటూ దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ 2025 ఆగస్టు 4న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వీటిపై విచారించిన సుప్రీంకోర్టు.. తామిచ్చే తుది ఉత్తర్వులకు లోబడి ఎమ్మెల్సీల ఎంపిక ఉంటుందని మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. ఆ తర్వాత కోదండరాం, అలీఖాన్ ఎమ్మెల్సీలుగా ప్రమాణం చేశారు. మధ్యంతర ఉత్తర్వుల తర్వాత ఎమ్మెల్సీలుగా ప్రమాణం చేయడాన్ని బుధవారం విచారణలో సుప్రీంకోర్టు తప్పుపట్టింది. అందుకే గతంలోని మధ్యంతర ఉత్తర్వులను సవరిస్తున్నట్లు ప్రకటించింది. ఇద్దరు ఎమ్మెల్సీగా ప్రమాణం చేయడంపై స్టే విధిస్తున్నట్లు తెలిపింది. ఏప్రిల్ 31తో ఆరు నెలల గడువు ముగుస్తున్న క్రమంలో కొత్త గవర్నర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉందని కోర్టుకు తెలిపారు అటార్నీ జనరల్.

బుధవారం ఈ కేసును విచారించగా..కోదండరాం, అజారుద్దీన్ లపై కొత్త గవర్నర్ నిర్ణయం తీసుకునేందుకు సమయం ఇవ్వాలని అటార్నీ జనరల్ కోర్టును కోరారు. కొత్త గవర్నర్ నిర్ణయం తర్వాత విచారణ కొనసాగించాలా? ముగించాలో సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. తీర్పును జూలై 22 కు వాయిదా వేసింది సుప్రీంకోర్టు ధర్మాసనం.

## దావోస్, రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లోని ఎంవోయూలపై రేవంత్ రెడ్డి సమీక్ష

- కంపెనీలకు సౌకర్యాలు, భవిష్యత్తు అవసరాలపై ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని సూచన
- ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలను మూడు కేటగిరీలుగా విభజించాలని సూచన
- ప్రముఖ సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వాలన్న ముఖ్యమంత్రి



## దావోస్, రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లోని ఎంవోయూలపై రేవంత్ రెడ్డి సమీక్ష

దావోస్, రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో ఎంవోయూలు కుదుర్చుకున్న కంపెనీలకు భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ రెండు సదస్సుల్లో జరిగిన ఎంవోయూలపై ఆయన బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రౌండ్ అయిన కంపెనీలు, పెండింగ్ అంశాలు, ఫ్యూచర్ సిటీ, ఇతర ప్రాంతాల్లో సంస్థలకు కేటాయించాల్సిన భూమి వివరాలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పెట్టుబడులు పెట్టే కంపెనీలకు సౌకర్యాలు, భవిష్యత్తు అవసరాలపై ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. ఎస్టీపీల ద్వారా శుద్ధి చేసిన నీటిని డేటా సెంటర్లు వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలను మూడు కేటగిరీలుగా విభజించి, ప్రముఖ సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి అన్నారు. ఆయా సంస్థలు రాష్ట్రంలో త్వరగా కార్యకలాపాలు ప్రారంభించేలా చూడాలని అన్నారు.

## వికారాబాద్ లో స్థంభించిన ఆర్టీసీ రవాణా

**వికారాబాద్:** వికారాబాద్ జిల్లాలో ఆర్టీసీ కార్మికులు అర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగడంతో బస్సు సేవలు పూర్తిగా స్థంభించాయి. సమ్మె ప్రభావంతో వికారాబాద్ డిపో నుంచి ఒక్క ఆర్టీసీ బస్సు కూడా బయటకు రాకపోవడంతో అన్ని బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో ఉదయం నుంచే ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్సు సేవలు లేకపోవడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు మరియు తమ పనులకు వెళ్లే ప్రజలు ప్రత్యామ్నాయ రవాణా కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఇక సమ్మె నేపథ్యంలో వికారాబాద్ జిల్లా ఆర్టీసీ డిపో ముందు భారీగా పోలీసులు మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా చర్యలు చేపట్టారు. ఆర్టీసీ జేఏసీ నాయకులతో ప్రభుత్వం నియమించిన కమిటీ జరిపిన చర్చలు విఫలమవడంతో కార్మికులు సమ్మె బాట పట్టినట్లు తెలిపారు. సమ్మె నోటీసులు ఇచ్చి 41 రోజుల తర్వాత మాత్రమే ప్రభుత్వం చర్చలకు పిలిచిందని, తమ సమస్యలను వివరించినప్పటికీ సరైన హామీ ఇవ్వలేదని కార్మికులు ఆరోపించారు. తమ డిమాండ్లు కొత్తవి కావని, పాతవేనని కార్మికులు స్పష్టం చేశారు. ఆర్టీసీ విలీనం, సంఘాల ఎన్నికలు నిర్వహించడం, బస్సులను ఆర్టీసీ ద్వారానే నడపడం వంటి అంశాలు తమ ప్రధాన డిమాండ్లు అని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దంటే గతంలో 40 రోజులు అమ్మే చేశాం ఇపుడు మరింత పెద్దగా మా డిమాండ్లు నెరవేరే దాకా సమ్మె చేస్తామని ఆర్ టీ సి కార్మికులు డిమాండ్ చేశారు. మా ఆర్ టి సి కార్మికులతో పెట్టుకుంటే గత ప్రభుత్వం ఎలా ఓటమి పాలైందో ఈ ప్రభుత్వం కూడా పడిపోవడం పక్కా అని డిమాండ్ చేస్తున్నారు.

## హయత్ నగర్ డిపో లో హయత్ నగర్

**రంగారెడ్డి జిల్లా :** ప్రభుత్వం నియమించిన కమిటీతో టీజీఎస్ఆర్టిసి జేఏసీ జరిపిన చర్చలు విఫలం కావడంతో కార్మికులు సమ్మెకు దిగారు. హయత్ నగర్ ఆర్టీసీ డిపో 1 మరియు డిపో 2 లో బస్సులు ఎక్కడి అక్కడ నిలిచిపోయాయి. ఆర్టీసీ కార్మికులు డిపో ముందు ధర్నాకు దిగారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి. ఉద్యోగులకు ఇచ్చే పేస్కేల్ వెంటనే రిలీజ్ చేయాలి. యూనియన్ల పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేసారు.ప్రధానంగా ఆర్టీసీ కార్మికులు చేస్తున్న డిమాండ్ ను వెంటనే ప్రభుత్వం చొరవ తీసుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు ఆర్థిక శాఖ మంత్రి మరియు రోడ్డు రవాణా మంత్రి వీటిపై తక్షణమే అమలు చేయాలంటూ డిపో ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేసారు. ...

## సింగర్ 200 కోట్ల కథ ఏంటీ

**హైదరాబాద్, ఏప్రిల్ 22, :** సింగర్ మంగ్లీ, రెండు తెలుగు రాష్ట్రాల్లో పరిచయం అవసరం లేని పేరు. తన పాటలతో.. పాటంటే మంగ్లీ, మంగ్లీ అంటే పాట అన్నట్లుగా ఎదిగారు. ఊరువాడ తన గొంతుతో ఉర్రూతలూగించిన ఈ జానపద కోకిల, ఇప్పుడు 'నోట్ల' డప్పు కొడుతోందా? స్టేజ్ మీద స్టెప్పులేసే మంగ్లీ, ఇప్పుడు పోలీస్ స్టేషన్ చుట్టూ చక్కర్లు కొట్టాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? అసలు ఈ 200 కోట్ల కథ ఏంటి? ఎవరిని నమ్మించి ముంచేశారు.? ఈ స్కామ్‌లో నిజంగానే మంగ్లీ పాత్ర ఉందా.?ఒకప్పుడు మంగ్లీ గొంతు వింటే పల్లె పులకరించేది.. కానీ ఇప్పుడు మంగ్లీ పేరు వింటే వివాదాలు పలకరిస్తున్నాయి. తాజాగా 200 కోట్ల స్కామ్ ఆరోపణలు ఆమె చుట్టూ ముసురుకున్నాయి. ఒక విధంగా చెప్పలంటే మంగ్లీ టైమ్ అస్సలు బాలేదు.! మొన్న తిరుమలలో ప్రొటోకాల్ వివాదం.. అంతకుముందు బోనాల పాటలో పదాల గొడవ.. ఆ తర్వాత కాళహస్తిలో డ్యాన్స్ ఇష్యూ. ఇలా ఒకదాని తర్వాత ఒకటి ఆమెను వెంటాడుతూనే ఉన్నాయి. అయితే ఇవన్నీ ఒకెత్తు.. ఇప్పుడు వచ్చిన '200 కోట్ల స్కామ్ మరో ఎత్తు. ఇది కేవలం పాటల గొడవ కాదు.. సామాన్యుల జేబులకు పడ్డ కన్నాల గురించి! మంగ్లీ మాట నమ్మి పైసలు పోగొట్టుకున్న బాధితులు, ఇప్పుడు ఆమెపై నిప్పులు చెరుగుతున్నారు.గోకుల నందన ఇన్ఫ్రా అనే కంపెనీలో మంగ్లీ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నారు. అయితే స్కామ్ జరిగింది కూడా ఇదే కంపెనీ పేరుతో కావడంతో మంగ్లీ కూడా ఈ స్కామ్‌లో ఉన్నారనే ఆరోపణలకు మరింత బలం చేకురింది. కంపెనీలో.. మంగ్లీ కేవలం బ్రాండ్ అంబాసిడర్ మాత్రమేనా? లేక వెనకుండి నడిపించిన డైరెక్టరా? అన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. పోలీసులు 10 కోట్లు అంటే.. బాధితులు 200 కోట్లు అంటున్నారు. అంటే ఇక్కడ లెక్కల్లో భారీ మొత్తంలో తేడా కొడుతోంది! మంగ్లీ ఏమో నాకేం తెలీదు.. నేను అమాయకురాలిని అని నార్సింగిలో ఫిర్యాదు చేశారు. పంజాగుట్టలో ఆమెపై కేసు నమోదైతే.. ఆమె వెళ్లి నార్సింగిలో కంప్లైంట్ ఇవ్వడం చూస్తుంటే.. సీన్ చాలా రివర్స్‌లో ఉన్నట్టు కనిపిస్తోంది. తర్వాత మళ్లీ పంజాగుట్టలో కూడా ఫిర్యాదు చేశారనుకోండి అది వేరే విషయం.విషయానికి వస్తే.. అడ్వకేట్ సుబ్బారావు అనే వ్యక్తి మంగ్లీ ఆమె తమ్ముడు శివ, తన స్నేహితులు మధు, భరత్ చౌహాన్‌పై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గోకుల నందన ఇన్ఫ్రా సంస్థలో పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయని నమ్మించి సుమారు 150 మందికిపైగా డబ్బులు వసూలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన వద్దకు వచ్చి బాధితులు మొరపెట్టున్నారని సుబ్బారావు తెలిపారు. ఈ స్కామ్ విలువ సుమారు 200 కోట్ల రూపాయల వరకు ఉండొచ్చని ఫిర్యాదులో చెప్పారు. వాటితో పాటు భరత్ చౌహాన్ డబ్బు కట్టలను లెక్కిస్తున్న వీడియోను కూడా ఆయన రిలీజ్ చేశారు. దీంతో విషయం మరింత రాజుకుంది. ఈ టీమ్ వసూళ్లకి పాల్పడితే మంగ్లీ ప్రమోషన్ చేశారంటూ బాధితులతో కలిసి పోలీసులకు కంప్లయింట్ ఇచ్చారు. మరోవైపు 'మాకు కంపెనీ గురించి తెలియకపోయినా, మంగ్లీని చూసి, ఆమె మాటలు నమ్మి మా కష్టార్జితాన్ని పెట్టుబడిగా పెట్టాము. ఇప్పుడు కంపెనీ బోర్డు తిప్పేస్తే, ఆమెకు సంబంధం లేదనడం సరికాదు" అని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతన్నారు.ఈ విషయంపై కాస్త లేటయినా ఘాటుగా రియాక్ట్ అయ్యారు మంగ్లీ. మనీ మ్యాటర్.. లాయర్ ఆరోపణలు.. ఈ రెండింటిని తిప్పికొట్టారు. తన వ్యక్తిత్వానికి భంగం కలిగేలా.. అసత్య ప్రచారాలు చేస్తున్నారంటూ పంజాగుట్ట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కోట్ల రూపాయల స్కామ్ అంటూ జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదన్నారామె. సోషల్ మీడియాతో ఎదిగిన తనను.. అదే సోషల్ మీడియా అప్రతిష్టపాలు చేస్తుందని ఊహించలేదని మంగ్లీ కన్నీరు పెట్టున్నారు. కాస్త ఎమోషనల్ అవుతూనే ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌తో సంబంధం లేదని మంగ్లీ కుండబద్దలు కొట్టారు. అడ్వకేట్ సుబ్బారావు సెలెబ్రిటిగా మారాలి అని టార్గెట్ పెట్టుకున్నారు. ఫేమస్ అవ్వడమే తన లక్ష్యమని మంగ్లీ ఆరోపించారు. శ్రీముఖి అంటే క్రష్ అని చెప్పాడని మంగ్లీ సంచలన వ్యాఖ్యలు చేశారు. నా ద్వారా ఫేమస్ అయి బిగ్‌బాస్ లోకి వెళ్ళాలి సుబ్బారావు అనుకుంటున్నాడని అన్నారు. అందుకే నన్ను ఇలా ఇరికించాలని ప్రయత్నిస్తున్నాడు అంటూ మంగ్లీ ఎమోషనల్ అయ్యింది. మంగ్లీ చెప్పింది నిజమైతే.. మరి స్కీమ్ పేరుతో జరిగిన స్కామ్‌లో ఉన్నదెవరు? పైసా వసూల్ డైరెక్షన్ ఎవరిది? వీడియోలో కన్పిస్తోన్న డబ్బంతా ఎవరి చేతుల్లోకి వెళ్లిపోయింది? మంగ్లీ ఆరోపిస్తున్నట్టు ఫేమ్ అయ్యేందుకే అడ్వకేట్ సుబ్బారావు ఇంత హంగామా చేస్తున్నారా అన్నది పోలీసుల విచారణలోనే తేలాలి. ఏది ఏమైనా మంగ్లీ వ్యవహారం ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో హాట్‌టాపిక్ మారింది.

# జూబ్లీ బస్ స్టేషన్ లో నిలిచిపోయిన బస్సులు



**సికింద్రాబాద్..**
ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో జూబ్లీ బస్ స్టేషన్ లో బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. పికెట్, కంటోన్మెంట్, రాణిగంజ్ డిపోలలో ఆర్టీసీ బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.ఉత్తర తెలంగాణ కు వెళ్లాల్సిన బస్సు సర్వీసులు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు ఆర్టీసీ కార్మికుల సమస్యలను తీర్చాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం విజయవంతం కావడానికి ఆర్టీసీ కార్మికులే కారణమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తించాలని అన్నారు. గతంలో కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు ఆర్టీసీలో పని చేసే వారికి పిఆర్సి ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు నెరవేర్చలేదని ఇదే విషయమే పలుమార్లు అధికారులతో చర్చలు జరిగినప్పటికీ విఫలం కావడంతోనే తాము సమ్మె నోటీసు వచ్చి సమ్మెకు దిగినట్లు వెల్లడించారు. ఇప్పటికైనా ఆర్టీసీ కార్మికుల సమస్యలను గుర్తించి ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# నిలిచిన ప్రగతి రధ చక్రం.. డిపోలకే పరిమితమైన 6000 బస్సులు

### 60 లక్షల మంది ప్రయాణికులపై ప్రభావం



**హైదరాబాద్, ఏప్రిల్ 22 :** తెలంగాణ వ్యాప్తం గా ఆర్టీసీ కార్మికులు బుధవారం సమ్మె బాట పట్టారు. ప్రభుత్వంతో నిర్వహించిన చర్చలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపో వడంతో, మంగళవారం అర్ధరాత్రి నుంచే కార్మికులు తమ విధులను బహిష్కరించారు. ఈ సమ్మె కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ డిపోల్లో ఆర్టీసీ బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. పలు జిల్లాల్లో బస్సు సర్వీసులు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పరిస్థితిని అదుపులో ఉంచడానికి ప్రభుత్వం అన్ని ప్రధాన బస్ డిపోల వద్ద భారీగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసింది.ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల తెలంగాణ ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందని, ఉద్యోగులందరూ సమ్మె ఆలోచన విరమించి విధులకు హాజరుకావాలని సంస్థ TGRTC ఎండీ వై. నాగిరెడ్డి పిలుపునిచ్చారు. కార్మికుల డిమాండ్లపై సమగ్రంగా చర్చించేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఐఏఎస్ అధికారులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసిందని ఆయన గుర్తుచేశారు. ఈ కమిటీ ఇప్పటికేశీ మంగళవారం కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశమై పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు ఆయన వివరించారు.కార్మికులు లేవనెత్తిన డిమాండ్లలో కొన్ని ఆర్థికపరమైనవి, సాంకేతిక చిక్కులతో కూడిన అంశాలు ఉన్నాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార మార్గాలను అన్వేషించడానికి ప్రభుత్వానికి కనీసం 4 వారాల సమయం అవసరమని నాగిరెడ్డి పేర్కొన్నారు. సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నందున, ప్రభుత్వం కోరిన గడువుకు సహకరించాలని ఆయన కోరారు.అయితే కొన్ని సంఘాలు వాస్తవాలను పక్కనబెట్టి, సమ్మె పేరుతో కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సులపైనే ఆధారపడి ప్రయాణించే దినసరి కూలీలు, సామాన్య ప్రజలు మరియు విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యతప్రతి ఉద్యోగిపై ఉందని ఆయన హితవు పలికారు. సంస్థ ప్రయోజనాలను, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, కార్మికులు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా బాధ్యతాయుతంగా విధుల్లో పాల్గొనాలని ఎండి నాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ సమ్మె.. కార్మికులు ఏం డిమాండ్ చేస్తున్నారు తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల సమ్మె తీవ్ర రూపం దాల్చింది. ఈ సమ్మెలో కార్మికుల ప్రధాన డిమాండ్ ఆర్టీసీని పూర్తిగా ప్రభుత్వంలో విలీనం చేయడం. సంస్థను కేవలం ఒక కార్పొరేషన్‌గా కాకుండా ప్రభుత్వ శాఖగా గుర్తించి, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని వారు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. దీనితో పాటు 2021 నుండి పెండింగ్‌లో ఉన్న వేతన సవరణను 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను తక్షణమే విడుదల చేయాలని కోరుతున్నారు. ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సులను అద్దెకు తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ, సంస్థే నేరుగా కొత్త బస్సులను కొనుగోలు చేయాలని జేఏసీ స్పష్టం చేస్తోంది.సమ్మెను అడ్డుకునేందుకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జరిపిన చర్చలు సఫలం కాలేదు. ప్రభుత్వం జీవో నంబర్ 66 ద్వారా ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ, జేఏసీ నాయకులు దానిని ససేమిరా తిరస్కరించారు. కమిటీల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, తమ సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాటం ఆపేది లేదని జేఏసీ చైర్మన్ ప్రకటించడంతో సమ్మె అనివార్యమైంది.

ఈ సమ్మె ప్రభావం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 60 లక్షల మంది ప్రయాణికులపై పడనుంది. దాదాపు 6,000 బస్సులు డిపోలకే పరిమితం కావడంతో హైదరాబాద్ సిటీ బస్సులతో పాటు జిల్లాలకు వెళ్లే పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నిలిచిపోనున్నాయి. నిత్యం ప్రయాణించే విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోనున్నారు. చివరకు ఎయిర్‌పోర్ట్ పుష్పక్ సర్వీసులు కూడా నిలిచిపోవడంతో విమాన ప్రయాణికులకు సైతం కష్టాలు మొదలయ్యాయి.ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించింది. ప్రైవేట్ వాహనాలు, పాఠశాల బస్సులను తాత్కాలికంగా ప్రయాణికుల కోసం వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్ల సహాయంతో కొన్ని బస్సులను నడపాలని ప్రభుత్వం భావిస్తోంది.

# రేవంత్ పేరెత్తక్కుండానే...



**హైదరాబాద్, ఏప్రిల్ 22,**
చాలా రోజుల తర్వాత జనంలోకి వచ్చారు గులాబీ బాస్. జగిత్యాల వేదికగా తనదైన శైలిలో ప్రభుత్వంపై విమర్శల దాడి చేశారు. ఏకంగా తన చావును కోరుకుంటున్నారంటూ స్ట్రాంగ్ రిప్లై ఇచ్చి సోషల్ మీడియాకు కావాల్సిన స్టఫ్ ఇచ్చారు కేసీఆర్. సేమ్‌టైమ్ కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలను ఎండగట్టిన ఆయన హైడ్రాను రద్దు చేస్తామంటూ ప్రకటించినా కూడా ఎక్కడా రేవంత్‌రెడ్డి పేరు తీయలేదు. కనీసం ముఖ్యమంత్రి అన్న పదం కూడా ఎత్తకుండా ప్రసంగాన్ని కంప్లీట్ చేశారు. ఇదే ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. పరోక్షంగా రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ఆగ్రహం వ్యక్తం చేశారు తప్ప ఆయన పేరెత్తలేదు. కేసీఆర్ వ్యూహాత్మకంగానే రేవంత్ పేరు ఎత్తకుండా జాగ్రత్త పడుతున్నారనే గుసగుసలు విన్పిస్తున్నాయి.గతేడాది ఏప్రిల్ 27న వరంగల్‌లో జరిగిన బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ సభలో కేసీఆర్ గంటకు పైగా మాట్లాడినప్పటికీ, రేవంత్ రెడ్డి పేరును ఎక్కడా ప్రస్తావించలేదు. అదేసమయంలో డిప్యూటీ సీయం భట్టి ప్రస్తావన సైతం తీసుకొచ్చారు. ఆ సమయంలో అది రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంపై, రేవంత్ సర్కార్ తీసుకొచ్చిన హైడ్రాపై అటాక్ చేసిన కేసీఆర్ ఎక్కడా రేవంత్ రెడ్డి పేరును ఎత్తలేదు. కనీసం ముఖ్యమంత్రి అని గాని, సీఎం అనిగాని ప్రస్తావించలేదు. అయితే ఈసారి పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ పేరు ప్రస్తావించడం విశేషం.రెండున్నరేళ్ల ప్రతిపక్ష హోదాలో ఒక్కసారి కూడా సీఎం రేవంత్ రెడ్డి పేరును పలకకపోవడంపై రాజకీయవర్గాల్లో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. రేవంత్‌రెడ్డి మాత్రం ప్రతీసభ, సమావేశం చివరకు చిట్‌చాట్లలోనూ కేసీఆర్‌పైనే అటాక్ చేస్తుండగా.. కేసీఆర్ మాత్రం రేవంత్ పేరు ప్రస్తావనకు రాకుండా జాగ్రత్త పడుతున్నారు. కేసీఆర్ అనే మొక్కను మళ్లీ మొలవనివ్వను అంటు డైరెక్ట్ ఎటాక్ చేస్తున్నారు రేవంత్. కేసీఆర్ చచ్చిన పాము అని, ఫాంహౌస్‌కే పరిమితం చేశానని చెప్పడమే కాదు..వ్యక్తిగత విమర్శలు చేసేందుకు కూడా వెనకాడటం లేదు సీఎం.లేటెస్ట్‌గా రైతు భరోసా నిధుల విడుదల సభలోనూ కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి ఓ రేంజ్‌లో ఫైర్ అయ్యారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా రానివ్వనని కేసీఆర్‌కు సవాల్ విసిరారు. ఇలాంటి పరిస్థితుల్లో కనీసం జీవన్ రెడ్డి లాంటి కరడు గట్టిన కాంగ్రెస్ నేతలు కూడా రేవంత్ తీరుతో బయటకు వస్తున్నారంటూ జగిత్యాల సభలో కేసీఆర్ కచ్చితంగా రేవంత్‌పై అటాక్ చేస్తారని అంతా ఊహించారు. కానీ కేసీఆర్ మాత్రం కనీసం రేవంత్ పేరు తీయకుండానే స్పీచ్‌ను ముగించి మరోసారి చర్చకు తెరలేపారు.

ఇప్పుడే కాదు గత రెండున్నరేళ్ల కాలంలో పార్టీ అంతర్గత సమావేశాల్లోను కేసీఆర్ ఎక్కడా రేవంత్ రెడ్డి పేరును పలకలేదని బీఆర్ఎస్ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. ఇక ముందు కూడా రేవంత్ రెడ్డి పేరును గులాబీ బాస్ కేసీఆర్ పలకకపోవచ్చని పార్టీ నేతలు అంటున్నారు

## రైతులు పండించిన పంటను గిట్టుబాటు ధరకు అమ్మ కోవాలి, దళారులను నమ్మి మోసపోవద్దు . మార్కెట్ చైర్మన్ బీమా నాయక్.







**సీ కే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఏప్రిల్ 22.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలో ఉన్న నర్సాయిగూడెం, లోతుకుంట, గొల్లపెల్లి పరిధిలో ఉన్న బూర్ల గడ్డ, గ్రామాలలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభించిన మార్కెట్ చైర్మన్ భీమా నాయక్ వైస్ చైర్మన్ మల్లారెడ్డి. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పాశం సత్తిరెడ్డి, తుమ్మల శ్రీనివాస్,తుమ్మల సంతోష్,కాసుల వెంకన్న, బత్తిని సహదేవ్, నరేందర్, జక్కజంగారెడ్డి, నర్సాయి గూడెం
గ్రామ సర్పంచ్ పసల జ్యోతి,అధ్యక్షులు తుమ్మల లావణ్య,సెక్రెటరీ కాటా మంజుల, వేములకొండ సంతోష, వివోఏ పసల రాణి, లోతుకుంట సర్పంచ్ రాచకొండ రాములు, వార్డ్ నెంబర్లు జిల్లా నాయకులు రాచకొండ కృష్ణ, బుర్లగడ్డ మార్కెట్ ప్రారంభోత్సవంలో ప్రారంభోత్సవంలో సర్పంచ్ రాణి మధు, అనురాధ,రాజేశ్వరి,రాధిక,లింగమ్మ, వార్డు నెంబర్లు ఉప సర్పంచ్ వెల్ దొండ కృష్ణారెడ్డి,రైతులు మార్కెట్ సిబ్బంది ఏపీఓ ఆంజనేయులు సీసీలు అశోక్ రవీందర్ బాబు తదితరులు పాల్గొన్నారు. నాయకులు మీడియా ద్వారా మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు దరకు పంటను అమ్ముకోవాలని,దళారులను నమ్మి మోసపోవద్దని, వడ్లను మ్యాచరు వచ్చే విధంగా రైతులు ధాన్యాన్ని అందుబాటులో ఉంచుకోవాలని కోరినారు.ద

### వెల్టూర్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**సీకే న్యూస్ ప్రతినిధి, వనపర్తి జిల్లా**
పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీ మల్లురవి, వనపర్తి శాసనసభ్యుడు తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సంయుక్తంగా ప్రారంభించారు. రైతులకు న్యాయమైన ధరలు అందించడమే లక్ష్యంగా ఈ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను విక్రయించుకునేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, మహిళా సంఘ సభ్యులు మరియు రైతులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామాలయంలో దర్శనాల నిలిపివేత..!



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 22,** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయ అభివృద్ధి పనుల నేపథ్యంలో ఆలయ పునర్నిర్మాణ పనులలో భాగంగా దేవతా మూర్తులను బాలాలయం మరియు ఇతర ప్రాంతాలకు తరలించే "కళావాహన కార్యక్రమము" నిర్వహించనున్నారు. ఈ కారణంగా ఈనెల 26వ తేదీన ఆలయంలో దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు దేవస్థానం ఆలయ కార్యనిర్వహణాధికారి దామోదర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు.
ఈనెల 26తేదీన (ఆదివారం) దర్శనాల నిలిపివేత సమయం: ఉదయం నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు. అన్ని రకముల ఆర్జిత సేవలు మరియు సర్వ దర్శనాలు రద్దు చేయబడ్డాయి. తిరిగి ప్రారంభం: అదే రోజు మధ్యాహ్నం 03:00 గంటల నుండి భక్తులను యథావిధిగా దర్శనాలకు అనుమతిస్తారు.
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భద్రాచల ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా, ఆలయ చుట్టుపక్కల ఉన్న దేవతామూర్తులను రంగనాయకుల గుట్టపై ఉన్న శ్రీ రామదాసు ధ్యాన మందిరం వద్ద గల బాలాలయంకు తరలిస్తున్నారు. అలాగే అండాళ్ అమ్మవారు, లక్ష్మీతాయారు అమ్మవార్లను ప్రధాన దేవాలయ ముఖమండపంలోకి మార్చే ప్రక్రియను వైదిక పెద్దలు నిర్వహించనున్నారు.
ఈ ఆధ్యాత్మిక క్రతువు దృష్ట్యా భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ఉదయం పూట దర్శనాలను నిలిపివేస్తున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. భక్తులందరూ ఈ మార్పును గమనించి సహకరించాలని కోరారు.

# ఏన్కూరులో విద్యా వార్షిక సమీక్షా సమావేశం

- విద్యార్థుల ప్రతిభకు వేదికగా సక్సెస్ మీట్
- ప్రజల భాగస్వామ్యంతో నమోదు పెంపుపై దృష్టి
- ప్రైవేట్ స్కూళ్లకు కాకుండా ప్రభుత్వ బడుల వైపు మొగ్గు చూపాలని పిలుపు

**సికే న్యూస్ ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఏన్కూరు ఏప్రిల్ 22 2026:** ఏన్కూరు మండల కేంద్రంలోని కమ్మవారి కల్యాణ మండపంలో విద్యా వార్షిక సమీక్షా సమావేశం మండల విద్యాధికారి నాగిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రామదాస్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
కార్యక్రమం ప్రారంభానికి ముందు విద్యార్థులు ఎమ్మెల్యేకు సంప్రదాయబద్ధంగా ఆహ్వానం పలికి స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులచే ఈసీఆర్ (జుజ=) అంశంపై అవగాహన నాటక ప్రదర్శన నిర్వహించగా ప్రేక్షకులను ఆకట్టుకుంది. "ప్రైవేట్ స్కూల్ వద్దు -- ప్రభుత్వ బడి ముద్దు" అనే సందేశంతో విద్యార్థులు ప్రదర్శించిన అవగాహన డాన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థుల నమోదు పెంపుదలలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ప్రైవేట్ స్కూళ్లపై ఆధారపడకుండా ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపాలని, ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు.
సమావేశంలో భాగంగా "అందరు విద్యార్థుల సక్సెస్ మీట్" నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధ్యమని అధికారులు అభిప్రాయపడ్డారు.
అయితే, బడి బాట వంటి కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ గతంతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్య తగ్గిపోవడం సమావేశంలో ప్రధాన ఆందోళనగా మారింది. ఈ నేపథ్యంలో ప్రజల్లో మరింత అవగాహన కల్పించి, ప్రభుత్వ విద్యా వ్యవస్థపై నమ్మకం పెంచాల్సిన అవసరం ఉందని సూచించారు.
అలాగే పీటీఎం (రూవీ) సమావేశాలకు తల్లిదండ్రుల హాజరు తక్కువగా ఉండడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. పీటీఎం సమావేశాలను క్రమబద్ధంగా నెలనెలా నిర్వహించి, తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంచే చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు.
ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ లచ్చిరాం నాయక్,




విద్యాశాఖ ఏవో ప్రభాకర్ రావు, ఎమ్మార్వో సిహెచ్ గిరి రావు, ఎంపీడీవో కృష్ణ, ఎస్ఐ ఎన్ సంధ్య, హెచ్ఎంలు వాసవి దేవి, రహీం బి, స్వర్ణ నరేందర్, మెడ ధర్మారావు, మండలంలో ప్రభుత్వ పాఠశాల హెచ్ఎంలు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సత్తుపల్లి ట్రంక్ కాలువ పనులు వేగవంతం చేసి వర్షాకాలానికే గోదావరి జలాలు అందించాలి.



- అధికారులు అలసత్వం వీడి పనులు ముమ్మరం చేయాలి.
- గోదావరి జలాలతో ఉభయ జిల్లాలు సస్యశ్యామలం అవుతాయి.
- సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ సమీక్షా సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 22,** సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో భాగమైన సత్తుపల్లి ట్రంక్ కాలువ పనులను వేగవంతం చేసి రాబోయే వర్షాకాలానికి సత్తుపల్లి ఆయకట్టుకు గోదావరి జలాలు అందించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం సత్తుపల్లి నియోజకవర్గంలోని యతలకుంట లో ఉమ్మడి జిల్లా అధికారులతో కలిసి, అశ్వరావుపేట శాసన సభ్యులు జారే ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి సమక్షంలో సమీక్షా సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా మంత్రి ముందుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టి పంపు నుంచి యతలకుంట వరకు సాగుతున్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ కాలువ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న బ్రిడ్జులు, రోడ్డు క్రాసింగ్లు, కాలువ పనుల అమలులో ఉన్న లోపాలు, సమస్యలపై అధికారులకు పలు సూచనలు చేసి, ఎక్కడా నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా పర్యవేక్షణను మరింత పెంచాలని సూచించారు
అనంతరం జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఇంజనీరింగ్ అధికారులు అలసత్వాన్ని విడిచిపెట్టి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సత్తుపల్లి ట్రంక్ కాలువ ద్వారా సుమారు 43 కిలోమీటర్ల పొడవున 1.46 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం పనులు చేపట్టిందన్నారు. మొత్తం రూ.700 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పనుల్లో ఇప్పటివరకు సుమారు రూ.600 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని తెలిపారు.
యతలకుంట టర్మినల్‌కు సంబంధించిన మొత్తం 1.78 కిలోమీటర్ల పనుల్లో చివరి 30 మీటర్ల పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. గోదావరిలో వరదలు వచ్చేలోపు టర్మినల్ ఎగువ భాగంలోని స్ట్రక్చర్ నంబర్లు 5 నుంచి 10 వరకు ఉన్న పెండింగ్ పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మే నెలాఖరులోగా అసంపూర్తిగా ఉన్న అన్ని స్ట్రక్చర్ల పనులను పూర్తి చేయాలని, వర్షాకాలానికి ముందే టన్నెల్ ఎగువ భాగంలో ఉన్న ఆరు స్ట్రక్చర్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు.
భూసేకరణకు అవసరమైన నిధులు పూర్తిగా మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. కోర్టు కేసులు లేదా భూసంబంధిత సమస్యల కారణంగా ఎక్కడైనా పనులు ఆలస్యమైతే వెంటనే జిల్లా కలెక్టర్ల దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. చిన్నచిన్న భూ సమస్యల కారణంగా పనులు నిలిచిపోవడం సమంజసం కాదని, రైతులతో చర్చించి సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యలను సమయానికి తెలియజేయకుండా పనులు నిలిపివేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భూసేకరణలో కొన్ని సమస్యలు, అవసరమైన అనుమతులు ఇంకా పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ వాటిని త్వరితగతిన పరిష్కరించి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. కోర్టు కేసుల కారణంగా మరో ఒక కిలోమీటర్ కాలువ పనులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఆయకట్టు ఖమ్మం జిల్లా పరిధిలో ఉండగా, నిర్మాణ పనులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో కొనసాగుతున్నందున ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అటవీ, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.
ఒక్క కిలోమీటర్ పనుల కోసం వేల కోట్ల వ్యయం జరుగుతున్న ఈ ప్రాజెక్టులో చిన్న కారణాల వల్ల పనులు నిలిచిపోవడం సరికాదని మంత్రి స్పష్టం చేశారు. ఏ సమస్య వచ్చినా వెంటనే జిల్లా కలెక్టర్లు లేదా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.
యతలకుంట టన్నెల్ నిర్మాణంపై గత ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్ణయం తీసుకుని కేవలం రెండు సంవత్సరాల్లో టన్నెల్‌ను పూర్తి చేసినట్లు తెలిపారు. ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్, సూపరింటెండింగ్ ఇంజనీర్ ప్రత్యేక దృష్టి పెట్టి అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి రాత్రింబవళ్లు పని చేసి ఈ సీజన్‌లోనే నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
రాజీవ్ కాలువ స్టెబిలైజేషన్ ద్వారా ఇప్పటికే సుమారు 1.35 లక్షల ఎకరాలకు నీరు అందించామని మంత్రి తెలిపారు. ఈ సంవత్సరం నాగార్జున సాగర్ జలాలు అందకపోయినా వైరా ఆయకట్టు, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి మండలాల కు గోదావరి జలాలను మళ్లించే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా సత్తుపల్లి ట్రంక్ కాలువ ద్వారా వేంసూరు, దమ్మపేట మండలాలకు కూడా నీరు అందించే అవకాశముందని అన్నారు .
నాలుగో పంప్ హౌస్ పనులు పూర్తి అయితే వచ్చే సంవత్సరం అశ్వరావుపేట, దమ్మపేట మండలాలకు గోదావరి జలాలు అందించవచ్చని తెలిపారు. దీంతో మొత్తం 110 కిలోమీటర్ల మేర కాలువ వ్యవస్థ పూర్తవుతుందని, మెయిన్ కాలువతో పాటు మూడు పంప్ హౌస్‌లను వినియోగించి గోదావరి జలాలను ఉభయ జిల్లాల్లోని 8 నియోజకవర్గాలకు సరఫరా చేసే అవకాశం కలుగుతుందని అన్నారు.
పాలేరు ప్రాంతానికి గోదావరి జలాలు చేరాలంటే జూలూరుపాడు టన్నెల్ పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉందని, దానిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అలాగే ఈ ప్రాజెక్ట్ ద్వారా ఉభయ జిల్లాల్లోని మధ్య తరహా ఇరిగేషన్ ప్రాజెక్టులకు నీరు అందించడమే కాకుండా మారేళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్‌ను పూర్తి చేసి పినపాక నియోజకవర్గంలో 16,500 ఎకరాలకు నీరు అందించే లక్ష్యంతో ఉన్నామని తెలిపారు.
సీతారామ ప్రాజెక్ట్‌కు సంబంధించిన డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో టెండర్లు పిలిచినట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.
ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేస్తేనే ప్రాజెక్ట్‌ను నిర్దేశిత కాలంలో పూర్తి చేసి ఉభయ జిల్లాలను సస్యశ్యామలంగా మార్చగలమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.
ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు,ఉభయ జిల్లాల ఇంజనీరింగ్ ఇరిగేషన్ పోలీస్ ఫారెస్ట్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లీడ్ బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ ను కలిసిన.



**సీ కే న్యూస్ వనపర్తి జిల్లా స్థాపరిపోర్టర్** వనపర్తి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్ గోపాల్ పెట మండలం బుద్ధారం గ్రామంలో ఏర్పాటుచేసిన యూనియన్ బ్యాంక్ ప్రారంభోత్సవానికి వచ్చిన లీడ్ బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ కలవడం జరిగింది. పానగల్ మండలం మహమ్మదాపూర్ గ్రామంలో కొత్తగా యూనియన్ బ్యాంకు ను ఏర్పాటు చేయవలసిందిగా వారికి ఒక వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ యొక్క బ్యాంకు ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల ఉన్నటువంటి 10 గ్రామాలకు అందుబాటులో ఉంటుంది కాబట్టి ప్రజలను దృష్టిలో ఉంచుకొని ఈ యొక్క బ్యాంకును ఇక్కడ స్థాపించవలసిందిగా విజ్ఞప్తి చేయడం జరిగింది. సమగ్ర నివేదిక ఆధారంగా అక్కడి పరిస్థితులను బట్టి చూస్తామని హామీ ఇవ్వటం జరిగింది.

## భద్రాద్రి కొత్తగూడెం టీజీజీడీఏ ఎన్నికలు ఏకగ్రీవం.

**అధ్యక్షుడిగా డా. దుబ్బాసి ప్రవీణ్ కుమార్ ఎన్నిక.**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,ఏప్రిల్ 22,**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (మోడ్రన్ మెడిసిన్) యూనిట్‌కు 2026--2028 కాలానికి నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా, ఏకగ్రీవంగా పూర్తయ్యాయి. ఈ ఎన్నికలలో మొత్తం 06 నామినేషన్లు దాఖలవగా, అవన్నీ చెల్లుబాటు కావడంతో అన్ని పదవులకు పోటీ లేకుండానే అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అధ్యక్షుడిగా డా. దుబ్బాసి ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా డా. బి. సైదులు, కోశాధికారిగా డా. భూక్య వీరబాబు ఎన్నికయ్యారు. జనరల్ కౌన్సిల్ సభ్యులుగా డా. రామవత్ బలోజీ, డా. ఆర్. కరుణాకర్, డా. అజహర్ బాబా షేక్ ఎంపికయ్యారు.ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి తిరస్కరణలు లేదా ఉపసంహరణలు నమోదు కాకుండా, మొత్తం 6 నామినేషన్లు చెల్లుబాటు కావడం విశేషం.కొత్తగా ఎన్నికైన కమిటీకి వైద్యుల నుండి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. తమ పదవీకాలంలో వైద్యుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆకాంక్ష వ్యక్తమవుతోంది.

# విద్యానగర్ లో బహుళా అంతస్తుల అక్రమ నిర్మాణాలు.



- గిరిజన చట్టాలను లెక్కచేయకుండా అక్రమ నిర్మాణాలు.
- ఆక్రమ నిర్మాణాలకు పార్కింగ్ ప్లేసులు ఉండక రోడ్లమీదనే వాహనాలు.
- ఇవేవి మాకు పట్టనట్లు చోద్యం చూస్తున్న అధికారులు.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ చుంచుపల్లి ప్రతినిధి,ఏప్రిల్ 22,**భద్రాద్రి, కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం విద్యానగర్ గ్రామ పంచయతీ పరిధిలో అనేక బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. గతంలో అనేక అక్రమ నిర్మాణాలపై సీ కే న్యూస్ దినపత్రిక లో ఎన్నో కథనాలు ప్రచురించాయి అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలు చేస్తున్న వారికి అండగా నిలిచిన అధికారులపై చర్యలు తీసుకుంటామని గత కొన్ని నెలలుగా ఉన్నతాధికారులు చెబుతన్న ఇవేమీ మాకు పట్టవు అన్నట్లుగా పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది అనేక అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్నారు కళ్ళ ఎదుట అక్రమ నిర్మాణాలు కదుతున్నప్పటికీ ఇవేవీ కనిపించలేవు కనిపించట్లేదు అన్నట్టుగా పంచాయతీ సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి 1/70 యాక్టుల్తో నిర్మాణాలు చేపట్టవచ్చా చేపడితే గిరిజన చట్టాలు వారికి వర్తిస్తాయా లేక పంచాయతీ అధికారులు సిబ్బంది గిరిజన చట్టాలను తుంగలో తొక్కుత్నరీ అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్నారా? ఇవన్నీ తెలిసిన అధికారులు మౌనంగా ఉండడం వెనుక ఆంతర్యం ఏమిటా అని బహువటంగానే చర్చించుకుంటున్న ప్రజలు . గతంలో ప్రజా ప్రతినిధులు లేకుండా ఉండేది మరి ఇప్పుడు ప్రజాప్రతినిధులు ఉన్నారు మరి వారైనా ఇటువంటి అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేస్తారా లేదా అన్నది చూడాల్సిందే ఏది ఏమైనా విద్యానగర్ గ్రామ పంచాయతీ పరిధిలో అనేక అక్రమ నిర్మాణాలు జి ప్లస్ త్రీ నిర్మాణాలు సైతం నిర్మిస్తున్న నిమ్మకు నీరెత్తినట్టు అధికారులు వ్యవహరిస్తున్నారు అనడంలో ఎటువంటి సందేహమే లేదు.. ఇలా అక్రమ నిర్మాణాలు జి ప్లస్ త్రీ నిర్మాణాలు నిర్మిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదు కనీసం పార్కింగ్ సౌకర్యం కూడా లేకుండా నిర్మాణాలు చేస్తుండడం నిర్మాణాలు పూర్తయిన తర్వాత పార్కింగ్ ప్లేస్ ఉండక రోడ్లు మీదనే వాహనాలు నిలపాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది దీనితో అనేక ఆక్సిడెంట్లు జరుగుతున్నాయి ఎన్ని రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు చేసినప్పటికీ అనుమతులు లేని వ్యాపార సముదాయాల వద్ద పార్కింగ్ ప్లేస్ లేక రోడ్లమీదనే వాహనాలు నిలుపుదల చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. ఎటువంటి అనార్థాలు జరగకుండా ఉండాలంటే ముందుగానే ఇటువంటి అనుమతులు లేని అక్రమ నిర్మాణాలకు అవకాశం ఇవ్వకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటే బాగుంటుంది. ఆకులు కాలాక చేతులు పట్టుకుంటే ఏం లాభం అన్నట్టుగా పార్కింగ్ స్థలాలు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తులు నిర్మించకుండా ముందస్తుగానే కఠిన చర్యలు అధికారులు తీసుకుంటే ఈటువంటి ప్రమాదాలను నివారించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి కావున అధికారులు స్పందించి అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలను జి ప్లస్ త్రీ నిర్మాణాలను సైతం నిలుపుదల చేసి వారికి అండగా నిలిచిన పంచాయతీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు.

# భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా ఎండీ జిందా.

- పట్టణంలో భారీ సంబరాలు...
- యువత ఆధ్వర్యంలో 100 బైకులతో ర్యాలీ --
- శాసనసభ్యుడు డాక్టర్ తెల్లం వెంకట్రావుకు కృతజ్ఞతలు ...



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 22,**తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రకటించిన తాజా జిల్లా కమిటీలో భద్రాచలం పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు ఎండీ జిందా ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా నియమించడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. దీర్ఘకాలంగా పార్టీకి సేవలందిస్తున్న ఆయనకు ఈ పదవి దక్కడం పట్ల కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిందా నియామకాన్ని పురస్కరించు కొని భద్రాచలం పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. ముఖ్యంగా కొత్త కాలనీ ప్రాంతానికి చెందిన యువత అధిక సంఖ్యలో పాల్గొని సుమారు 100 బైకులతో భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా సాగిన ఈ ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ జెండాలు ఎగురవేస్తూ, జిందా అనుకూల నినాదాలు చేస్తూ యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం జిందాను కలసిన కార్యకర్తలు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ, జిందా ఎప్పటినుంచో పార్టీ కోసం కష్టపడుతున్న నాయకుడని, అతని సేవలను గుర్తించి పార్టీ ఉన్నతాధికారులు ఈ బాధ్యతలు అప్పగించారని తెలిపారు.

ఈ సందర్భంగా ఎండీ జిందా మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి జిల్లా కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన పార్టీ ఉన్నత నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. భద్రాచలం నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని, ప్రతి కార్యకర్తను కలుపుకొని ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. అదేవిధంగా తన నియామకానికి కృషి చేసిన భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారి మార్గదర్శకత్వంలో పార్టీ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తానని పేర్కొన్నారు. స్థానికంగా పార్టీ బలోపేతం, గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలను విస్తరించడం, యువతను పార్టీ వైపు ఆకర్షించడం తన ప్రధాన లక్ష్యమని జిందా వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు, యువ నాయకులు, మహిళా కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మొత్తానికి, ఎండీ జిందా నియామకం భద్రాచలం కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపడంతో పాటు, భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి దోహదం చేస్తుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఏఐసిసి అధ్యక్షులు కార్గే దిష్టిబొమ్మ దగ్ధం.

మోడీని కించపరిచినందుకు నిరసనగా.







**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఏప్రిల్ 22.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో.

భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల శాఖ అధ్యక్షుడు శ్రీ బోళ్ల సుదర్శన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ దిష్టిబొమ్మ దగ్ధం...

కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గౌరవ ప్రధాని నరేంద్ర మోడీ గారిని ఉగ్రవాదితో పోల్చడం హేయమైన చర్యని బిజెపి మండలాధ్యక్షుడు సుదర్శన్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు తరచుగా ఏమి చేయాలో తోచని స్థితిలో మతిస్థిమితం లేకుండా నోటికి వచ్చిన విధంగా భారత ప్రధానిని పట్టుకొని ఉగ్రవాదుతో పోల్చడం దుర్మార్గమని , రాబోయే రోజుల్లో ఇలాంటి వాక్యాలు నా పునరావృతం అయితే కాంగ్రెస్ పార్టీ ని ఈ రాష్ట్రంలో ఎక్కడికక్కడ ఎండగడతావని వారు తీవ్రంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాచకొండ కృష్ణ, కందుల తానేష్ గౌడు,మంద నరసింహ ముదిరాజ్ ,బచ్చు శ్రీనివాస్, రాముల, నరసింహ, మాజీ ఉపసర్పంచ్ మచ్చగిరి, రావుల పద్మా రెడ్డి, మండల పదాధికారులు మందుల నాగరాజు, లోడే లింగస్వామి గౌడ్, గంగాధరీ దయాకర్, మండల నాయకులు మచ్చ గిరి, మహేష్, బుంగమట్ల మహేష్, ఆమనగంటి శివ,ఆవుల శీను, వార్డ్ మెంబర్లు చారి, ఉపేందర్, కీర్తి వెంకటేశం రాజేశ్వర చారి, జనార్దన్ రెడ్డి, మైసొల్ల నరసింహ, వేణు రెడ్డి, వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోచమ్మ గుడిలో దొంగతనం చేసిన దొంగ అరెస్ట్





- వివరాలు వెల్లడించిన డి.ఎస్.పి ఆదినారాయణ.
- టూ టౌన్ సీఐ ప్రతాప్ ఎస్సై కిషోర్ ని అభినందించిన డి ఎస్ పి.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / చుంచుపల్లి ప్రతినిధి, ఏప్రిల్ 22,** ఈనెల ఏప్రిల్20 న అర్ధరాత్రి పోచమ్మ గుడి లో దొంగతనం కేసులో దొంగను అరెస్టు చేసి ప్రెస్ మీట్ నిర్వహించిన కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ టూ టౌన్ సిఐ ప్రతాప్. సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం ధన్బాద్ పోచమ్మ గుడిలో హుండీనీ పగలగొట్టి అందులోనే 300 రూపాయలు అమ్మవారి త్రిశూలం దొంగలించుకొని వెళ్లగా అట్టి విషయంలో కొత్తగూడెం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయబడినది అదే రోజు అర్ధరాత్రి రామవరం పునందాసు గడ్డలో భూక్య లావణ్య కిరాణా షాపు నందు దొంగతనం జరిగి కొన్ని మద్యం బాటిళ్లు, 4000 రూపాయలు నగదు దొంగిలించి పడగా అట్టి విషయమై కేసు నమోదు చేయబడినది. అట్టి విషయమై కొత్తగూడెం టు టౌన్ సిఐ ప్రతాప్ తన సిబ్బందితో పెట్రోలింగ్ చేయుచుండగా పాలిటెక్నిక్ కాలేజ్ సమీపంలో గతంలో పలు నేరాలకు పాల్పడిన మర్రిగూడెం గ్రామానికి చెందిన మడివి భద్రయ్య తండ్రి సింగయ్య అను వ్యక్తి అనుమానంతో ఒక సంచి తో తిరుగుతుండగా అట్టి వ్యక్తిని పట్టుకొని విచారించగా అతను పోచమ్మ గుడిలో జరిగిన దొంగతనం నేనే చేశానని అందులోని హుండీని పగలగొట్టి అందులో వున్న 300 రూపాయలు దొంగిలించినానని, ఇంకా ఏమైనా దొరుకుతాయని వెతుకుతుండగా అమ్మవారి చేతిలో ఉన్న త్రిశూలం కనపడగా త్రిశూలం గట్టిగా లాగగా అమ్మవారి చేయి విరిగినది త్రిశూలం దొంగిలించినానని అంతకుముందు రామవరం లోనీ వనందాసు గడ్డలో చిట్టి రామవరం వెళ్లే దారిలో ఉన్న కిరాణం షాపులో దొంగతనం చేసి మద్యం బాటిల్లు, 4000 రూపాయలు నగదును దొంగతనం చేశానని నేరం ఒప్పుకున్నాడు. అట్టి వ్యక్తి మద్యం బాటిలను కొన్ని అమ్ముకోగా, అతని వద్ద 13 కోటర్ బాటిల్స్, 300 రూపాయల నగదు దొరకదా పంచుల సమక్షంలో కొత్తగూడెం టూ టౌన్ సిఐ పంచనామ ద్వారా స్వాధీన పరుచుకొని సదరు ముద్దాయి మడివి భద్రయ్యను అదుపులోకి తీసుకొని రిమాండ్ నిమిత్తం పంపించడం జరుగుతుందని కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ తెలియ చేసినారు.

# ఇల్లందు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.50 కోట్లు..

- ప్రజల శ్రేయస్సే లక్ష్యం -- ప్రజాప్రతినిధులు సేవాభావంతో పనిచేయాలి.
- వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు..
- ఇల్లందు పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 22,**ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటిడిఏ పీవో రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

పర్యటనలో భాగంగా మంత్రి ఇల్లందు 10వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తడికమల్ల భాగ్యమ్మ, కోడిమల్ల లక్ష్మి గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని, పూజలు నిర్వహించి లబ్ధిదారులతో కలిసి గృహాలను ప్రారంభించారు. అనంతరం ఇల్లందు మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన చైర్‌పర్సన్ గది ప్రారంభించి, చైర్ పర్సన్ కిరణ్ మిత్రకు శుభాకాంక్షలు తెలిపారు. ఆపై మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇల్లందు పట్టణ అభివృద్ధికి ప్రత్యేక మున్సిపల్ సమావేశం ఏర్పాటు చేసి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చుతామని అన్నారు . ఇల్లందు అభివృద్ధికి రూ.50 కోట్లు మంజూరు చేస్తామని ఇచ్చిన మాట ప్రకారం, త్వరలో రెండు విడతల్లో నిధులు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.ప్రజల శ్రేయస్సే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రాజకీయాలకు అతీతంగా అందరికీ సమానంగా అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేయాలని సూచించారు. వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు ప్రతిరోజూ సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలతో నిత్యం సంబంధం పెంచుకుంటూ ఉదయం, సాయంత్రం సమయం కేటాయిస్తే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వం నిరంతరం ప్రజల కోసం పని చేస్తుందని, ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యతగా ప్రజలకు సేవ చేయాలని మంత్రి కోరారు. కొత్తగా ఎన్నికైన సభ్యులు అనుభవం లేదని భావించకుండా అధికారులతో సమన్వయం చేసుకొని సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య మాట్లాడుతూ , మంత్రి నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో 200 నుంచి 700 ఓట్ల మెజారిటీతో గెలుపొందారున్నారు. కొత్తగా వార్డు కౌన్సిలర్లు ప్రతి వార్డులో సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల్లో పారిశుద్ధ్యం, లైటింగ్, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. వేసవిలో నీటి సమస్యలు లేకుండా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని, వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేస్తూ సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నామని వివరించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం ఆర్డీవో మధు, గృహ నిర్మాణ శాఖ ఫీడింగ్ రవీందర్ నాథ్, తాసిల్దార్ ఎంపీడీవో ధన్సింగ్,మున్సిపల్ వైస్ చైర్మన్ రాజు, మున్సిపల్ కమిషనర్ సంబంధిత శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నర్సాపురం లో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం.



**సి కే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఏప్రిల్ 22.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలో ఉన్న నరసాపురం గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్ భీమా నాయక్ వైస్ చైర్మన్ మల్లారెడ్డి ఈ కార్యక్రమంలో నరసాపురం గ్రామస్తులు గ్రామ సర్పంచి కావటి మంజుల, ఉప సర్పంచ్ వార్డు నెంబర్లు, నార్కెట్పల్లి ఆంజనేయులు జాల కొమురయ్య రైతు సంఘం సభ్యులు కల్లూరు లక్ష్మి రైతు కిష్టయ్య కావటి అండాలు జిల్లా నాయకులు పాశం సత్తిరెడ్డి జక్క జంగారెడ్డి కాసుల వెంకన్న బత్తిని సహదేవు రాజమల్లు యాదవ్ రైతులు పాల్గొన్నారు.ు

# సింగరేణి సంస్థ ఉద్యోగుల ఆరోగ్య భద్రతపై అవగాహన.





**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,ఏప్రిల్ 22,** కొత్తగూడెం ఏరియాలోని పీవీ కె నెంబర్.5 ఇంక్లైన్ మైన్‌లో సింగరేణి సంస్థ ఉద్యోగుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని, ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించబడింది. 1వ షిఫ్ట్ 2వ షిఫ్ట్‌లలో హెల్త్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మెయిన్ హాస్పిటల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లలిత ఉద్యోగులకు ఎండాకాలంలో సంభవించే హీట్ స్ట్రోక్, డీహైడ్రేషన్ వంటి సమస్యల గురించి వివరించి, వాటి నివారణకు తగిన జాగ్రత్తలను సూచించారు. తగినంత నీరు తాగడం, తేలికపాటి ఆహారం తీసుకోవడం, సూర్యరశ్మి నుండి రక్షణ పొందడం వంటి ముఖ్యమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా మైన్ మేనేజర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ, ఉద్యోగులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వైద్యుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ఉద్యోగుల్లో ఆరోగ్యంపై అవగాహన మరింత పెరిగింది. ఉద్యోగులు ఈ సూచనలను పాటిస్తూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అధికారులు సూచించారు. సింగరేణి సంస్థ ఇలాంటి ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెయిన్ హాస్పిటల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లలిత తో పాటు మైన్ మేనేజర్ శ్యామ్ ప్రసాద్, వెల్ఫేర్ ఆఫీసర్ షకీల్, ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ భూక్యా రమేష్, ఐ ఎన్ టి యు సీ పిట్ సెక్రెటరీ చిలక రాజయ్య ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.